# తప్పేమున్న వాడు...

పిప్పళ్ల సూర్య ప్రకాశరావు




***అది పెళ్లి కూడా? లేక పిండా కూడా?***

***నేనెపుడూ తినలేదు అటువంటి భోజనం. బయట పడేస్తే ఆ కూడు*** కుక్కలు కూడా ముట్టవు. ఒక్కగానొక్క కొడుకు పెళ్లి ఘనంగా చేయవల్సింది.

పిల్లనవాళ్ళందర్నీ కలుపుకుంటే మహావుంటే వందమంది వుంటారు. వాళ్లకయినా సరైన భోజనం పెట్టకపోతే ఎలా ?

మళ్లా పేరుకు పేద్ద డాక్టరు ... సుబ్బ రామయ్యగారు చిరాగ్గా కదిలారు.

"నేను నోరువిడిచి పులిహోర మరోసారి పట్రావోయ్ అన్నాను. పులిహోరం మారుకి లేదండి అని నిర్మొహమాటంగా చెప్పాడా వడ్డించే పెద్ద మనిషి'' జానకమ్మ అందుకుంది.

"అవ్వ అది పెరుగా ? మజ్జిగనీళ్లంటే సరిపోతుంది. పోనీ రిసెప్షన్ చూద్దురూ. పెద్ద కప్పుల్లో కొంచెం టీ పోసి వాళ్లంటే వాళ్లు పకోడీలు ప్లేట్లో పెట్టారు.

గొప్పింటి సదుపాయాలు వాళ్ల కెందుకండీ ! ఎవడు ఏం బహుమతి తెచ్చాడా అని చూసుకోవడం తోనే సరిపోయింది వాడికి.

అంత సంపాదించాడు. ఏం చేసుకుంటాడు ? నెత్తిన పెట్టుకుని వెళతాడా ?

- పిసినారివెధవని... పిసినారివెధవని... వీణ్ని చూస్తుంటే నవాబుగారొకరు గుర్తుకొస్తున్నారు.''

"నవాబుగారా ? ఆయనెవరండి ?'' జానకమ్మ భర్త నడిగింది.

"అప్పట్లో ఆయన ప్రపంచంలోని ధన వంతుల్లో ఒకడు. కోట్లానుకోట్లు ఖజానాలో మూలుగుతున్నా చిరిగిపోయిన కురచ పైజామా, మాసిన టోపీ, సాదా లాల్చీతో వుండేవాడట. ఆయన ఒక టోపీని ముప్ఫయి సంవత్సరాలు వాడేరట !

చివరికాయన ఎంత చిన్నవాడు పోయినాసరే ఏమైనా ఖర్చవని చచ్చినవాళ్లింటికి నడిగట్టుకుని వెళ్లేవాడట !

ఎంత కూడబెడితేనే కూడా ఏమైనా పట్టుకు వెళ్లాడా ?

పూచికపుల్లకూడా పట్టుకువెళ్లలేదు !''

"పోనీ బంధువులంతమంది వచ్చారు. ఎవరి కైనా బట్టలు పెట్టారా ? కనీసం ఒక్క జాకెట్టు ముక్కకూడా...'' జానకమ్మ వేళ్ళు విరిచింది.

"అయినా వాడు వట్టి వాజమ్మ. పెళ్లాం ఎంతంటే అంత.''

"అవునండీ నేనూ చూసాను. కూర్చోమంటే కూర్చుని, నిల్చోమంటే నిల్చునే రకం. ఆవిడదే పెత్తనమంతా !''

"కారాపితే బాగుణ్ను. సిగరెట్లు తెచ్చుకోవాలి.''

"అక్కర్లేదు. బెజవాడలో తీసుకోవచ్చు. మరేం ఫర్వాలేదు.'' కస్సుమంది జానకమ్మ.

"అవును. బెజవాడలోనే తీసుకోవచ్చు. అక్కర్లేదు.'' అని మరి కిక్కురుమన్లేదు సుబ్బరామయ్యగారు !

బెజవాడ వచ్చింది.

సుబ్బరామయ్య దంపతులు దిగిపోయారు.

* * *

"చూసారా మాష్టరూ. పాపం సుబ్బరామయ్య గారు బెజవాడ వచ్చేవరకూ సిగరెట్టు తాగలేదు. పాపం ఆవిడ చెప్పేవరకూ సిగరెట్టేం ఖర్మ మంచి నీళ్లు కూడా ముట్టడు.''

"మనం అడక్కుండానే ఎవడైనా నేను పెళ్లాం మాటలు వినను అన్నాడనుకోండి. అంటే ఇంట్లో పెళ్లాం అంటే వణుకుడన్నమాట !

ఎవరన్నారో నాకు తెలియదుగాని పెళ్లయిన ప్రతీ వెధవా పెళ్లాం మాటలు వింటాడు. ఎటొచ్చీ ఏ మోతాదులో వింటాడూ అనే దాంట్లోనే తేడా !''

"ఇపుడు దిగినాయన సంగతేనా మీరు చెపుతూంట. ఎవరండాయన'' నారాయణమూర్తి మాష్టారు అడిగారు.

"ఆయనాండి. రిటైర్డ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సుబ్బరామయ్యగారు. పెన్షన్ యీయన పుచ్చుకుంటున్నా అందరి దృష్టిలో పడేసింది మాత్రం వాళ్లావిడే. అటువంటాయన డాక్టరుగార్ని పెళ్లాం చేతికింద వెధవని అంటున్నాడు. గురివింద గింజకు తన కిందున్న నలుపు తెలియదట !

డాక్టరుగార్ని పిసినారి పిసినారని తెగ తిట్టే పోసాడు. కాని ఆయనే అసలైన పిసినారి.

కొడుకు లిద్దరి పెళ్లి కోడళ్ల మొహాలు చూసి చేయలేదు. వాళ్ళు పట్టుకొచ్చే కట్నాలు చూసి చేసాడు. అందుకే జర్మనీ వెళ్లిన మొదటి కొడుకు పెళ్లాన్ని ఇండియాలో వదిలి అక్కడే వుండిపోయాడు. రెండోవాడి పెళ్లాం అవిటిది. అందుకనే లక్షకు పైగా గుంజాడు. సరే కూతురికి కట్నం యివ్వాల్సివస్తుందని మేనరికం అనే వంకతో గుమాస్తాకి కట్టబెట్టాడు. కొడుకులు పట్టుకొచ్చిన కట్నమంతా పెళ్లాం పేర వేసాడు.

ఈయనగారింట్లో పెళ్లి ఖర్చు అంతా ఎవరి దండీ ? కంట్రాక్టర్లది. ఆఖరికి కంట్రాక్టర్లు పంపిన అరిటాకులు, పెరుగు పెళ్లిలో మిగిలిపోతే పక్క వూరి హోటళ్లలో అమ్మించి డబ్బు చేసు కున్నాడు.

పెట్రోల్ బంక్ —

పర్సు తీసి రాంమూర్తి డబ్బిమ్మని కుర్రాడితో మిగతాది తర్వాత యిస్తానంటున్నాడు.

"నాకు తెల్దు బాబు. ఆయన నన్నట్టుకుని నానా బూతులు తిడతాడు. పెట్రోలు పోయించే ముందు చూసుకోవాలి బాబూ.''

"ఏమైందండీ ?'' మాష్టారడిగారు.

"ఏమీలేదు మాష్టారూ. పది రూపాయలదాకా తక్కువైంది.''

పది రూపాయలు తక్కువైందా ?

కంట్రాక్టర్ రాంమూర్తి దగ్గర పా రూపాయలు తక్కువయ్యాయి !

అందులోకి పాపం రాత్రంతా పెళ్లిలో వాళ్లతో పేకాడి వేయి రూపాయలదాకా గెల్చు కున్నాడు !

మొత్తానికి టికెట్ ఖర్చులు వసూలు చేసే స్తున్నాడన్నమాట !

డాక్టరుగారు తను వద్దు వద్దు అంటుండ గానే "ఒరేయ్ రాంమూర్తి మాష్టారిని దార్లో దించేయరా. అలాగే వెళ్లాలిగదరా నువ్వు'' అన్నారు.

రండి మాష్టారూ రండని రాంమూర్తి కూర్చో బెట్టుకుంటే, బడిపంతుల్ని గౌరవించే మాటకో కోటికో వున్నవాళ్లలో రాంమూర్తి ఒకడని తను మురిసిపోయాడు.

"ఇదిగోండి. ఏమిటి ఆలోచిస్తున్నారు ? పెళ్లికొడుకు, పెళ్లికూతురు దణ్ణాలు పెట్టగా, యివ్వగా మిగిలింది పదిహేనని'' చెంగు ముడి విప్పి అందించింది భర్త నారాయణమూర్తి మేష్టారుకి, సుగుణమ్మ.

"నా దగ్గరుందండి. తీసుకోండి'' అన్నారు మాష్టారు.

వద్దంటూనే తీసుకొని, కుర్రాడికి డబ్బులిచ్చి, కారు స్టార్ట్ చేసాడు రాంమూర్తి.

"అసలు సుబ్బరామయ్యగారి తమ్ముడు బెజవాడ లోనే వున్నారు. ఆయనకు ఆరుగురు పిల్లలు. కనీసం ఆరు రూపాయిలైన పిల్లలకివ్వవల్సివస్తుందని ఆయన ఇంట్లో దిగరు. ఇపుడాయన మరో స్నేహితుడి యింట్లో. అంత పిసినారి ఆయన...